క్లుప్తంగా

25, 26 తేదీల్లో జాబ్ మేళా

కాచిగూడ: భారత్ సేవా సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో మణికొండలోని సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మార్కెటింగ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్స్, ఫీమేల్ టెలీకాలర్స్, ఫీమేల్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, వెబ్ డిజైనర్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్స్, రిసెప్షనిస్టులు తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9959363083 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పార్కును సుందరీకరించండి


పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: నింబోలిఅడ్డ ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మీడియా పార్కు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారింది. గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులు, సిబ్బందితో కలిసి పార్కును సందర్శించారు. పార్కులో మొక్కలు ఎండిపోయి, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండడంతో కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఫయాజ్, గ్రేసీ, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బాలప్రసాద్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్పు అమలు చేయని ప్రతివాదికి ఆరు నెలల జైలు

ముషీరాబాద్: 2018లో వెలువడిన తీర్పు అమలు చేయని ప్రతివాది శ్రీతేజ బెనిఫిట్ ఫండ్ ఎండీ పి.హరికృష్ణకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ హైదరాబాద్ 2వ వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. శిక్ష అమలు నిలిపివేత ఉత్తర్వుల కోసం నెల రోజులు వాయిదా వేసినా ఎలాంటి ఉత్తర్వులు దాఖలు చేయనందున హరికృష్ణను శిక్ష అమలు కోసం జైలుకు పంపుతూ కమిషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సైదాబాద్ కాలనీకి చెందిన నూగూరు మేనక దాఖలు చేసిన ఫిర్యాదులో 2018 జూన్ 6న జిల్లా కమిషన్ తీర్పు చెప్పింది. రూ.8.25 లక్షల పరిహారం, ఐదు వేల ఖర్చులు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

పోటీపరీక్షల అభ్యర్థులు ధైర్యంతో ముందుకెళ్లాలి


పోటీపరీక్షల అభ్యర్థులతో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షలు రాసిన వారితో పాటు పోటీపరీక్షల అభ్యర్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీతో పరీక్షల రద్దు నేపథ్యంలో గురువారం బీజేవైఎం నేతలు, కార్యకర్తలు చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో అభ్యర్థులను కలిసి మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దోషులను శిక్షించే వరకు అభ్యర్థుల తరఫున బీజేపీ పోరాడుతుందని వినయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్‌కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

కాచిగూడ: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎస్‌జీజీబీఈఎస్ కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక అన్నారు. బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులకు భగవద్గీతలోని 'సనాతన ధర్మం-కర్మ యోగా'పై 15 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 23 వరకు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశం మంగళవారం కాచిగూడలోని బద్రుక కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పాల్గొని భగవద్గీతలోని కర్మ యోగాతో పాటు 3వ అధ్యాయం నుంచి శ్లోకాలను వివరించారు.

ఠాణా.. ఏర్పాటయ్యేనా?

- ఉత్తర్వులు వచ్చి మూడు నెలలైనా స్పష్టత రాని వైనం
- పూర్తిస్థాయిలో లభించని భవనం
- వారాసీగూడ పీఎస్ ఏర్పాటుకు బాలారిష్టాలు


డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌తో సమావేశమైన అధికారులు

సికింద్రాబాద్ : వారాసీగూడ పేరుతో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలీస్‌స్టేషన్‌కు బాలారిష్టాలు చుట్టుముట్టాయి. వారాసీగూడ పోలీస్‌స్టేషన్‌తో పాటు, చిలకలగూడ ఏసీపీ కార్యాలయాన్ని బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేయాలని మూడు నెలల క్రితం ఉత్తర్వులు వెలువడినా పనులు ముందుకు సాగడం లేదు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో పీఎస్, ఏసీపీ కార్యాలయ కార్యకలాపాలను కొనసాగించుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పోలీసు కార్యాలయాల ఏర్పాటుకు అడ్డంకులు తప్పడం లేదు.

పోలీసు ప్రతిపాదన ఇదీ!

బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ భవనంలో గ్రౌండ్ ప్లస్ రెండు ఫ్లోర్లు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో రిసెప్షన్ కౌంటర్, సందర్శకులు వేయిటింగ్ హాల్, మొదటి అంతస్తులో పోలీస్‌స్టేషన్, రెండవ అంతస్తులో అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. తీరా కమ్యూనిటీహాల్ వద్దకు వెళ్తే పరిస్థితి మరోలా ఉంది. కమ్యూనిటీహాల్ గ్రౌండ్, మొదటి అంతస్తులు పరాధీనంలో ఉన్నాయి. కేవలం 3వ అంతస్తు మాత్రమే అందుబాటులో ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బౌద్ధనగర్ కార్పొరేటర్ కార్యాలయం, మొదటి అంతస్తులో ఉమెన్ నైట్‌షెల్టర్ ఉంది.

నైట్ షెల్టర్ తీరు!

నామాలగుండులోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో తొలుత ఉమెన్ నైట్ షెల్టర్ ఉండేది. సదరు భవనం శిథిలావస్థకు చేరడంతో నేలమట్టం చేసి అప్పటి నుంచి నైట్ షెల్టర్‌ను కమ్యూనిటీహాల్లోకి బదలాయించారు. పీఎస్ ఏర్పాటు కోసం నైట్ షెల్టర్‌ను


పీఎస్, ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయనున్న బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్

వేరేచోటికి తరలించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.ఉమెన్ నైట్ షెల్టర్‌ను సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి కమ్యూనిటీహాల్‌లోకి మార్చాలనుకున్నారు. ఈలోపే అక్కడికి సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు వచ్చి చేరాయి. కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో తరగతులను మేడిబావి కమ్యూనిటీహాల్లోకి బదలాయించారు. ఉమెన్ నైట్ షెల్టర్ కోసం అధికారులు వేరే ప్రాంతంలో భవనం ఇవ్వాలని నిర్వాహకులు కోరుతున్నారు. షెల్టర్ మారనిది పీఎస్ ఏర్పాట్లు జరిగే అవకాశం లేదు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని కూడా త్వరగా ఖాళీ చేసే పరిస్థితులు లేవు. ఇది జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ ఇక్కడ మేమే ఉంటాం అని కార్పొరేటర్ అనుచరులు భీష్మించి కూర్చున్నారు.

- ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండవ అంతస్తులో మాత్రం ఏసీపీ కార్యాలయాన్ని పోలీసు అధికారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక గ్రౌండ్, మొదటి అంతస్తులు తమ చేతిలోకి వస్తే వారాసీగూడ పీఎస్ ఏర్పాటు పనులు చేపట్టే అవకాశం ఉంది.

24 తర్వాత ఏర్పాట్లు..

పీఎస్, ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన నగర పోలీసు అధికారులు ఇప్పటి వరకు అధికారుల నియామకం, వసతుల ఏర్పాట్లు చేయలేదు. ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు, సిబ్బంది కేటాయింపులు జరుగలేదు.అంబర్‌పేట్ ఏసీపీ శ్రీనివాస్‌రావును ఇన్‌చార్జి ఏసీపీగా తాత్కాలిక నియామకం చేశారు. ఈ నెల 24న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగుస్తున్నందున ఆపై అధికారుల నియామకం, పీఎస్ ఏర్పాట్ల పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేతో సమావేశం...

సికింద్రాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌తో పీఎస్ ఏర్పాటు గురించి పోలీసు అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌రావు, చిలకలగూడ డీఐ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ గ్రౌండ్, రెండు అంతస్తులను మొత్తంగా తమకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలపై గురువారం ఆమె కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లావణ్య మాట్లాడుతూ.. డివిజన్‌లో 68 పనులు ప్రారంభిస్తే 42 పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిని తక్షణమే పూర్తి చేయాలన్నారు. మెజార్టీ ప్రాంతాల్లో డ్రైనేజీ, కలుషిత తాగునీరు, లోప్రెషర్ నీటి సరఫరా సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, తక్షణమే అన్ని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వీధి కుక్కల సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలన్నారు. అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో సర్కిల్-16 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్, ఏఎంహెచ్‌ఓ జ్యోతిబాయి, డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతమైన జీవితం


రామకృష్ణ చంద్రమౌళి దంపతులను సన్మానిస్తున్న దైవజ్ఞశర్మ

నల్లకుంట: ఆధ్యాత్మికతతో జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. పండుగల్లోని ఆంతర్యం సైతం అదేనని ఆయన అన్నారు. తెలుగు, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి రచించిన 'చంద్రమౌళి చంద్రికలు' కవితా సంపుటికి జాతీయ ఉగాది పురస్కారం అందజేశారు. శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం న్యూ నల్లకుంటలోని శ్రీధర్ ప్లాజా, నటరాజ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దైవజ్ఞశర్మ రామకృష్ణ చంద్రమౌళి దంపతులను సన్మానించారు. సరళమైన భాషలో సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యే విధంగా సందేశాత్మక రచనలు చేస్తున్న కవి రామకృష్ణ చంద్రమౌళి అభినందనీయుడని ఆయన కొనియాడారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

అంబర్‌పేట: డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం భరత్‌నగర్‌లో నిర్వహిస్తున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులను ఆమె పరిశీలించారు. మ్యాన్‌హోళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా ఉంటున్నాయని, దీంతో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ నేతల నిర్బంధం


నగేష్‌ముదిరాజ్ నివాసంలో ఉన్న పోలీసులు

ముషీరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో చేసిన ఆరోపణల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిట్ విచారణకు హాజరవుతున్న క్రమంలో హిమాయత్‌నగర్‌లోని కార్యాలయానికి కాంగ్రెస్ నేతలు రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాంనగర్‌లోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్‌ను ఆయన నివాసం నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే హక్కును కాలరాస్తుందని, నిరసన తెలియజేసే వారిని అడ్డుకుంటుందని విమర్శించారు.

పేదింటి ఆడపిల్లల వివాహానికి అండగా కల్యాణలక్ష్మి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: పేదింటి ఆడపిల్లల వివాహానికి కల్యాణలక్ష్మి పథకం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు సుమారు రూ.30 కోట్లను కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అందజేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇలాంటి పథకాలు దేశంలో ఎక్కడా అమలుకావడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 16 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ లలిత, అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సేవాభావంతో విద్యనందించాలి..

అంబర్‌పేట: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు సేవాభావంతో విద్య అందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం మారుతినగర్‌లో ఏర్పాటు చేసిన నాలెడ్జ్ ప్లే స్కూల్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తారని, వారి పిల్లల విద్యాభ్యున్నతికి చేయూతనివ్వాలని సూచించారు.

26 నుంచి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవం, సీతారామ కల్యాణం, హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుండెపూడి మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 7 వరకు జరుగుతాయని వారు వివరించారు. గురువారం సాయంత్రం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేవాలయ ప్రథమ వార్షికోత్సవంతో పాటు సీతారాముల కల్యాణం, హనుమాన్ జయంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ టి.రామకృష్ణ, డాక్టర్ జి.కె.రమణ, మురికి గణేష్, పద్మ బాసాని, అర్చకులు కె.కృష్ణమూర్తి, బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం

అబిడ్స్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తామని సైఫాబాద్ డివిజన్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల్లో స్నేహభావాలు, మమతానురాగాలు పెరిగేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. సైఫాబాద్ ఏసీపీగా నియమితులైన ఆర్.సంజయ్‌కుమార్‌ను నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాస్ ముదిరాజ్, అభిమన్యుసింగ్, రాజేష్‌కుమార్ యాదవ్, నరేష్ పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

అంబర్‌పేట: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ కోరారు. గురువారం సీపీఎల్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగల నేపథ్యంలో స్థానిక బస్తీలు, కాలనీలకు చెందిన పెద్దలు పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే తమకు ఫిర్యాదు చేయాలని, వదంతులు నమ్మకుండా ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. సమావేశంలో అడ్మిన్ ఎస్‌ఐ మల్లేశ్, పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలంటూ కార్పొరేటర్ దీక్ష


దీక్ష చేస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు


డ్రైనేజీ నిర్మాణం కోసం తీసుకొచ్చిన పైపులు

ముషీరాబాద్: ముషీరాబాద్ జంబావినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ గురువారం ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ జలమండలి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జంబావినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.8 లక్షలు మంజూరై ఆరు నెలలు అయినప్పటికి పనులు ప్రారంభించ లేదన్నారు. ప్రజలు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పనుల ప్రారంభానికి సమయం ఇవ్వకపోవడంతోనే అధికారులు నిర్మాణ పనులు చేపట్టడం లేదని ఆమె ఆరోపించారు. స్పందించిన డీజీఎం మోహన్‌రాజు, సెక్షన్ మేనేజర్ నవీన్ కార్పొరేటర్‌తో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని వారు హామీ ఇచ్చారు. పైపులను జంబావినగర్‌కు తరలించాకే దీక్ష విరమిస్తానని కార్పొరేటర్ భీష్మించడంతో అధికారులు వాటికి అక్కడకు తరలించారు. బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కె.శంకర్‌రావు కార్పొరేటర్‌కు నిమ్మరసం తాగించి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం..

యువకుడితో పాటు వైద్యుడి అరెస్ట్

అంబర్‌పేట: ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం మేరకు.. పటేల్‌నగర్‌లో నివసించే బాలిక(17)ను ఇదే ప్రాంతానికి చెందిన నీలేష్(19) ప్రేమ పేరుతో మాటలు చెప్పి గర్భవతిని చేశాడు. వివాహం చేసుకోమంటే వాయిదా వేస్తూ గత ఏడాది జూన్ నెలలో బాలికను అబార్షన్‌కు ఒప్పించాడు. చెన్నారెడ్డినగర్‌లోని పద్మావతి ఆస్పత్రిని సంప్రదించి అబార్షన్ చేయాలని కోరాడు. కాసులకు కక్కుర్తి పడిన వైద్యుడు డాక్టర్ మల్లికార్జున్ అబార్షన్ చేసేందుకు ఒప్పుకుని గాంధీ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ రమేష్‌తో బాలికకు అబార్షన్ చేయించాడు. అనంతరం బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎప్పటిలాగే యువకుడితో ప్రేమ వ్యవహారం సాగిస్తూ వస్తుంది. ఇటీవల పెళ్లి చేసుకోవాలని బాలిక ఒత్తిడి తేవడంతో యువకుడు నిరాకరించాడు. దీంతో ఆమె ఇంట్లోవారికి జరిగిన విషయం చెప్పింది. ఈ సంఘటనతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురై ఆస్పత్రి వైద్యుడిని నిలదీసి ఆందోళనకు దిగారు. అనంతరం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు నీలేష్‌తో పాటు డాక్టర్ మల్లికార్జున్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గాంధీ ఆస్పత్రి వైద్యుడిపై సైతం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గొల్కొండ క్రాస్‌రోడ్స్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆందోళన కారులను ఉద్దేశించి సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా లక్షల మంది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురయ్యారని, ఈ వ్యవహారంపై పారదర్శకమైన విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, కమిటీ సభ్యులు నైతిక బాధ్యత వహించి పదవుల నుంచి తప్పుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే వారిని తొలగించాలన్నారు. పరీక్షలను తిరిగి నిర్వహించే క్రమంలో అభ్యర్థులకు ఎలాంటి భారం లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, కె.నాగలక్ష్మి, ఎం.వెంకటేష్, రాజన్న, ఎం.మహేందర్, జి.నరేష్, జి.కిరణ్, సి.మల్లేష్, ఆర్.వెంకటేష్, ఎం.అజయ్‌బాబు, కుమారస్వామి, ఆర్.అశోక్, వాణి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


రాంనగర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పీవైఎల్ నాయకులు


వర్ధంతి సభలో మాట్లాడుతున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ: దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా గురువారం ఏవీ కళాశాల వద్ద బీఆర్‌ఎస్ నగర నాయకుడు కల్వ గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు బల్లెకారి రమేష్, హనుమంతరావు, బాలయ్య, సిరిగిరి శ్యామ్, కార్తీక్, మధు, సత్యనారాయణ, అజ్జు, అరుణ్, నితీష్‌సాయి, వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞానకేంద్రంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఒక మనిషిని మరో మనిషి దోచుకునే వ్యవస్థ ఉండకూడదని కోరుకున్న గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. 23 ఏళ్ల వయసులోనే దేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం, భావి తరాల భవిష్యత్తు కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో ప్రజా శాస్త్రవేత్త టి.రమేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ.విజయ్‌కుమార్, అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, విద్యావేత్తలు వెంకటరమణ, కొమ్ము విజయ్‌కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

ముషీరాబాద్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో పీవైఎల్ నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌ఎల్ పద్మ, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రవికుమార్, నాయకులు శ్రీనివాస్, కిరణ్, యల్లప్ప, అంజి, అనిల్, ప్రకాష్, ఉదయ్, కృష్ణ, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.